# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో ధార్మిక సంస్థల సేవలు చాలా కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ ను గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తామని డిజిపి ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు.
- ❖ చేనేత కార్మిక సంఘాలను బలోపేతం చేస్తామని జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.
- ❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాలలో రాబోయే రెండు రోజులలో తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు మహారాష్ట్రలోని ముంబైలో పర్యటించనున్నారు. గోరేగావ్‌లోని నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో 29 వేల 400 కోట్ల రూపాయల విలువైన రహదారులు, రైల్వేలు, ఓడరేవుల రంగానికి సంబంధించిన బహుళ ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం ఐ.ఎన్.ఎస్. టవర్స్‌ను ప్రారంభించేందుకు ఇండియన్ న్యూస్ సర్వీస్ సెక్రటేరియట్‌ను సందర్శిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో ధార్మిక సంస్థల సేవలు చాలా కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు తాడేపల్లి సమీపంలోని కొలనుకొండలో హరే కృష్ణ గోకుల క్షేత్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అనంత శేష స్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ గోకుల క్షేత్రం ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఎటువంటి కార్యక్రమాన్నైనా సజావుగా పూర్తి చేయగలిగే విశ్వాసాన్ని హరే కృష్ణ ఉద్యమం కలిగించిందని తెలిపారు. హరే కృష్ణ ఉద్యమంతో పాటు, ఇస్కాన్ కూడా ఎన్నో కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను పునః ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఎస్.సవిత, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

చేనేత సంఘాలను పూర్తిగా ప్రక్షాళన చేసి, కార్మిక సంఘాలను బలోపేతం చేస్తామని జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పోలవరం గ్రామంలో చేనేత కార్మికులతో ఈ రోజు నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. చేనేత సహకార సంఘాల కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలను మంత్రి పరిశీలించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

నేరాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టేందుకు రాత్రిపూట గస్తీని మరింత పెంచినట్లు ఏలూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. మేరీ ప్రశాంతి తెలిపారు. ఇందులో భాగంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, అనుమానితుల వివరాలు సేకరిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. నిద్ర మత్తు కారణంగా ప్రమాదాలు సంభవించకుండా వాహనదారులకు నీటితో ముఖం శుభ్రపరచుకునే కార్యక్రమాన్ని కూడా రాత్రి గస్తీలో చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఎగువ ప్రాంతాల్లో  విస్తృతంగా వర్షాలు కురుస్తున్న కారణంగా వచ్చే వారం రోజుల్లో  గోదావరి నది నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి దిశ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాల నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు ముందస్తు జాగ్రత్తలతో సిద్ధంగా కావాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యల ప్రణాళిక రూపొందించాలని, అలాగే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, మత్స్యకారులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. నరసాపురం మండలం వేములదీవి తూర్పు గ్రామంలో కలెక్టర్ ఈ రోజు పర్యటించారు. తుపాను రక్షిత భవనంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో మత్స్యకారుల  సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీనిపై  ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ను గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు. తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో రాయలసీమ జిల్లాల పోలీసు అధికారులతో శాంతిభద్రతలపై ఆయన ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మైనర్ బాలికలు, మహిళలపై అఘాయిత్యాలను ప్రణాళికా బద్ధంగా అడ్డుకుంటామని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో

నిరోధిస్తామని, త్వరలో మత్తు పదార్థాల నిరోధక ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి అక్రమ రవాణా సమాచార సేకరణకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తున్నామని డీజీపీ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఈ రోజు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 12 కోట్ల 60 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన కొత్త భవన నిర్మాణాన్ని మంత్రి పరిశీలించి, పనులు జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పాత ఆసుపత్రిని పరిశీలించి, బాలింతల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచి నూతన భవనానికి నిధులు మంజూరు చేసినప్పటికీ.. ఇప్పటి వరకు భవన నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్ర ప్రదేశ్ తీరంలో సముద్ర మట్టానికి సగటున 5.8 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు చాలా చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

“తిరుపతి సిరిసంత” పేరుతో ప్రకృతి వ్యవసాయ పంటల సేంద్రియ మేళా ఈ రోజు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ప్రారంభమైంది. తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు తమ పంటలను ఈ మేళాలో ప్రదర్శించారు. కనెక్ట్ టు ఫార్మర్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ సేంద్రియ మేళ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకురాలు బొబ్బ శిల్ప ఆకాశవాణితో మాట్లాడుతూ... ప్రకృతి వ్యవసాయ పంటల ప్రాధాన్యత, పర్యావరణ హిత జీవనం వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శుద్ధిచేసిన రక్షిత తాగునీటిని ప్రజలకు అందించే చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ సంయుక్త కలెక్టర్ కే.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో వాటర్ ట్యాంకులను పూర్తి స్థాయిలో శుభ్ర పరచాలని, శుద్ధిచేసిన త్రాగునీటిని ప్రజలకు అందించే విధంగా గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ మేరకు ఇప్పటికే అందించిన ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ప్రకారం నడుచుకోవాలని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

మునుపెన్నడూ లేని విధంగా రహదారులు, మౌలిక సదుపాయాలు, సమాచార వ్యవస్థ, బ్యాంకింగ్ రంగాల్లో భారతదేశం పురోగతి సాధించిందని మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఈ రోజు విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం సమావేశ మందిరంలో డాక్టర్ ప్రయాగ మురళీమోహన కృష్ణ రచించిన "నల్ల టోపీ - నీలి కళ్లు - తెల్లతోలు" పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగా కొన్ని వస్తువులను తయారు చేసుకొని ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసుకోవచ్చని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =